ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
శుక్రవారం | 27 జూన్, 2025 | పేజీలు :08

## టెంపుల్ సిటీగా వేములవాడ పట్టణాభివృద్ధి



# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణరావు



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి :**మహాత్మా గాంధీ అందించిన స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణ రావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామితో కలిసి ఆయన జిల్లా కేంద్రానికి వచ్చారు. ముందుగా స్థానిక మావల వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రులకు ఘన స్వాగతం పలికారు. మంత్రులుగా నియమితులైన తర్వాత తొలిసారి జిల్లాకు రావడంతో వారికి శ్రేణులు అపూర్వస్వాగతం పలికి సత్కరించారు. భారి గజమాలతో సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. నిర్మల్ డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు మంత్రులకు స్వాగతం పలికారు. అక్కడి నుండి బైక్ ర్యాలీగా బయలుదేరి కొమరం భీం చౌక్ వద్ద భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అదేవిధంగా స్థానిక గాంధీ పార్కులో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి జై బాపు, జై భీం, జై సంవిదాన్ నినాదాలు చేశారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు రాజర్షిషా, అభిలాష అభినవ్, వెంకటేష్ దోత్రే, కుమార్ దీపక్, ఎస్పీలు అఖిల్ మహాజన్, క్రాంతి లాల్ పాటిల్, జానకి షర్మిల, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఐటిడిఏ పిఓ ఖుష్బూ గుప్తా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమబిందు తదితరులు మంత్రులకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు జూపల్లి కృష్ణరావు, గడ్డం వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఇచ్చిన స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తుందని, జిల్లాలోని ఆదివాసీల పరిస్థితులను మెరుగుపరిచి జిల్లా అభివృద్ధి బాటన నడిచేలా శాయ శక్తులా కృషి చేస్తామన్నారు. అహింస పద్ధతిలో శాంతియుతంగా స్వాతంత్రం తెచ్చిన మహాత్మ గాంధీని ఆదర్శంగా తీసుకుంటూ ముందుకు సాగుతామన్నారు. ప్రస్తుతం దేశ ప్రజలంతా రకరకాల ఇబ్బందులు పడుతున్నారని, పేదరికంలో బతుకుతున్నారని అన్నారు. మహాత్మా గాంధీ ఆలోచన విధానం, బీ.ఆర్. అంబేద్కర్ అనుసరించిన జీవన విధానం ద్వారానేసమస్యలకుపరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

**మంత్రులు పర్యటిస్తున్న వేల తప్పిన ప్రమాదం...**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంత్రులు పర్యటిస్తున్న వేల ప్రమాదం చోటు చేసుకుంది. పర్యటనలో భాగంగా తొలుత రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణరావు, గడ్డం వివేక్ వెంకట స్వామిలు పట్టణంలోని గాంధీ పార్కులో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సమయంలోనే పక్కనే ఒ చెట్టు కొమ్మ విరిగిపడింది. ఇటివల కురిసిన భారి వర్షాలతో కొమ్మ దెబ్బ తిని కింద పడడంతో అక్కడే ఉన్న కార్యకర్తలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కొమ్మ పడ్డ స్థలంలో ఎవరూ లేకపోవడంతో ఎవరికి దెబ్బలు తగలలేదు. కార్యకర్తలు. కొమ్మ పడ్డ స్థలంలో ఎవరూ లేకపోవడంతో ఎవరికి దెబ్బలు తగలలేదు. కార్యకర్తలు, ఇతరత్రా సిబ్బంది నిల్చున్న పక్కనే కొమ్మ పడగా.. అందరూ క్షేమంగా ఉండడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కొమ్మ పడిన వెంటనే భద్రత సిబ్బంది అప్రమత్తమయ్యారు. అనంతరం మంత్రులు అక్కడి నుండి సమావేశ స్థలికి బయలుదేరి వెళ్ళారు.




## జూలై 9న సార్వత్రిక సమ్మె

### కార్మిక సంఘాల నాయకుల పిలుపు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** బ్రిటిష్ వారితో సైతం కొట్లాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడలుగా విభజించి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఏఐటియుసి కార్యాలయంలో అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సన్నాహక సమావేశం ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. దేశంలో స్వాతంత్ర ఉద్యమం ఒక వైపు,కార్మిక హక్కుల కోసం మరొక వైపు పోరాటాలు చేసి కార్మిక చట్టాలను సాధించుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, మిడ్డే మీల్స్ మీసం లక్ష్మన్, సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ,అన్నల్దాస్ గణేష్, బిఆర్ టియు, పట్టణ అధ్యక్షులు పోరండ్ల.రమేష్, ఏఐఎఫ్ టి యు సోమిశెట్టి దశరదం, టియు సిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జిందం ప్రసాద్, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు ఆకుల రాములు తదితరులు పాల్గొన్నారు.

### 24 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి

# అనువైన స్థలాలు ఎంపిక

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** జిల్లాలోని 24 గ్రామపంచాయతీల భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలు ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరెట్ లో గ్రామ పంచాయతీ లకు సోంత భవనాల నిర్మాణం పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో 24 గ్రామాల్లో సొంత గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించాల్సి ఉందని, ఈ గ్రామాలలో జీపి భవనాల నిర్మాణానికి అనువైన భూములు ఎంపిక చేసి నివేదిక రేపటి వరకు అందించాలని కలెక్టర్ సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.ఆయా గ్రామాలలో ఉన్న గ్రామపంచాయితీ పరిధిలోనీ ప్రభుత్వ భూము లను ఎంపిక చేయాలని కలెక్టర్ తెలిపారు. డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# జీవితాన్ని చీకట్లో ముగించొద్దు

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కొత్తపల్లి:**మత్తు పధార్థాలకు బానిసలుగా మారి జీవితాన్ని చీకటి గదిలో ముగించవద్దని, యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళలు, పిల్లలు, వికలాం గులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కొత్తపల్లి లోని కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్య, ఇంజనీరింగ్ విద్య అభ్యసిస్తున్న కొంతమంది విధ్యార్థులు మత్తు పదార్థాల బారిన పడడం బాధాకరమని అన్నారు. కష్టపడి చదివి ఎంతో మందితో పోటీపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, మంచి భవిష్యత్తు ఉన్న అలాంటి విధ్యార్థులు మత్తు పధార్థాల బారిన పడడం శోచనీయమన్నారు. సిపి గౌష్ ఆలం మాట్లాడుతూ తనిఖీలు విస్తృతం చేస్తున్నామని, డ్రగ్స్ తీసుకున్నట్లు తెలిస్తే చట్టప్రకారం శిక్షార్హులవుతారని తెలిపారు. అనంతరం డ్రగ్స్ నిరోదంపై నిర్వహించిన పెయింటింగ్స్ పోటీలో విధ్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. డ్రగ్స్ నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేష్, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, సిడబ్ల్యూసి చైర్మన్ ధనలక్ష్మి , జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్, డివైఎస్‌వో శ్రీనివాస్ గౌడ్, ఎన్‌వైకె కో ఆర్డినేటర్ రాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ చేతన్ శర్మ, నషాముక్త్ భారత్ కమిటీ మెంబర్ కేశవ రెడ్డి, సూపరిండెంట్ వీరారెడ్డి పాల్గొన్నారు.

# అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**నిషేధిత జాబితాలోని సర్వే నెంబర్లలో గల భూమిని రిజిస్ట్రేషన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, బాధ్యులైన అధికారులపై కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అనుసరించి మాత్రమే రిజిస్ట్రేషన్లు జరపాలని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి పంపించిన ప్రతి నిషేధిత జాబితా సర్వే నెంబర్లను క్రోడీకరించి సమగ్ర జాబితా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నిషేదిత జాబితాలో ఉన్న భూములు, ప్రభుత్వ స్థలాలు రిజిస్ట్రేషన్ చేయడం వల్ల కొనుగోలు దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో సందర్శించి విచారించిన తర్వాతే గ్రామాల్లో ఇండ్లను ,భూములను మ్యూటేషన్ చేయాలని ఆదేశించారు. ఉన్న స్థలం కంటే ఎక్కువగా రిజిస్ట్రేషన్ చేయడం, తప్పుడు ధృవీకరణ పత్రాలు పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ చేస్తే చర్యలు తప్పవన్నారు. గిఫ్ట్ మ్యుటేషన్ చేసినప్పుడు కుటుంబ సభ్యుల అందరి సమ్మతి తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కరీంనగర్ చుట్టుపక్కల ఉన్న గ్రామాల పరిధిలో రిజిస్ట్రేషన్ల పట్ల జాగ్రత్తతో వ్యవహరించాలని, తప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇష్టారీతిలో పంచాయతీ సెక్రటరీలు నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నెంబర్లు కేటాయిస్తే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. భూభారతి సదస్సులలో వచ్చిన ధరఖాస్తులను రెండు రోజుల్లోగా ఆన్‌లైన్ పూర్తి చేయాలని తెలిపారు. ధరఖాస్తు క్లోజ్ చేస్తే సంబంధిత అర్జీదారుకు సవివరమైన సమాచారం ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇంటికి ఇసుక సరఫరాకు సంబంధించి టోకెన్ జారీలో తేదీ, సమయం ఖచ్చితంగా తెలియజేయాలని సూచించారు. పోలీసు కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సమయంలో ఖచ్చితంగా లింక్ డాక్యుమెంట్లను, హద్దులను పరిశీలించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేస్తే నిబంధనల ప్రకారం బాధ్యులపై క్రిమినల్ చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డిఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## హెల్మెట్ నిబంధన నగరంలో తీసివేయాలి

### సిపిఐ నగర శాఖ డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ నగరంలో వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడం సరికాదని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజులు పేర్కొన్నారు. హైదరాబాద్, వరంగల్ లాంటి పెద్ద నగరాల్లోనే హెల్మెట్ నిబంధన తప్పనిసరి లేదని, కరీంనగర్‌లో అట్టి నిబంధన తీసుకురావడంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని తెలిపారు. హెల్మెట్ నిబంధన అనేది సిటీ అవతల ఉంటే బాగుంటుందని, సిటీలో ఏ వాహనమైనా 20కి మించి స్పీడ్ ఉండదని గమనించాలన్నారు. నగరంలో అట్టి నిబంధనను సడలించాలని పోలీసు అధికారులను కోరారు. హెల్మెట్‌కు తప్ప ఏ నిబంధనైనా అభ్యంతరం లేదని, కమాండ్ కంట్రోల్ ద్వారా ఫైన్లు విధించేందుకు పోలీసులు తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నామని పేర్కొన్నారు. కేవలం హెల్మెట్‌కు మాత్రం అందులో నుంచి మినహాయించాలని కోరారు. చిన్న చిన్న పనుల కోసం బయటికి వచ్చే వాహనదారులకు హెల్మెట్ నిబంధనతో ఇబ్బంది పడతారని విజ్ఞప్తి చేశారు.

## బాధిత కుటుంబాలకు

# మాజీమంత్రి ఈశ్వర్ పరామర్శ

**ప్రజాపక్షం/ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో ఇటీవల పలువురు మృతిచెందగా సంబందిత కుటుంబాలను గురువారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామార్శించారు.పట్టణానికి చెందిన తన పూర్వ వ్యక్తిగత సహాయకులు బుగ్గారపు శ్రీనివాస్ తల్లి సులోచన అనారోగ్యంతో మృతి చెందగా మాజీమంత్రి పరమార్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా స్థానిక ముదిరాజు కాలనీకి చెందిన గాడిచెర్ల హిమశ్రీ మరణించగా వారి కుటుంబసభ్యులను కలిసి ఓదార్చారు.వెంట ఎఎంసి మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్,నాయకులు సంగి శేఖర్,ఆకుల రాజేష్ ,ఆసిఫ్,కొమురయ్య,అశోక్ తదితరులున్నారు

# రాచపల్లి పెద్ద చెరువు భూములు కబ్జా

## పట్టించుకోని సంబంధిత అధికారులు



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:**ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామంలోని పెద్ద చెరువును కబ్జా చేసి కొంతమంది పొలాలుగా మారుస్తున్నారు. ఈ చెరువు అంతకు మందు రెవెన్యూ రికార్డు ప్రకారం 645 సర్వే నెంబర్‌లో 125 ఎకరాల 33 గుంటలు ఉంది. ఈ చెరువు కింద సన్న చిన్న కారు రైతులకు సుమారు 200 ఎకరాలుండగా రెండు పంటలు సాగు చేసుకునేవారు. కబ్జా చేసుకుంటూ పోతే ఒక పంట సైతం పండడం లేదని సన్న చిన్న కారు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈమేరకు ఇల్లందకుంట తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. చెరువులో ఉన్న మట్టిని ప్రొక్లైనర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలించి పొలాలకు వాడుకుంటున్నారన్నారు. గత కొన్నేళ్లుగా కబ్జాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండడం సరికాదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పెద్ద చెరువుపై ఆధారపడి జీవనోపాది పొందుతున్న మత్స్యకారుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. వెంటనే పెద్ద చెరువును రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఛాంపియన్‌ల శిక్షణా శిబిరం

**ప్రజాపక్షం /ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఇంపాక్ట్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టి.బి ఛాంపియన్స్ శిక్షణా కార్యక్రమాన్ని జగిత్యాల జిల్లా ఉప వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్.ఎన్.శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టి.బి వ్యాధి లక్షణాలు,నిర్ధారణ పరీక్షలు, చికిత్స, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టీకాలు, పోషకాహారం గూర్చి వివరించారు. అలాగే మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం నుండి బయట పడు విధానాలు, చికిత్స, నిరోధం గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్య అధికారిణి లు డాక్టర్.ఎస్.శివ కుమారి, డాక్టర్.అస్మా తరుణం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీ. ఎల్లంకి శ్రీనివాస్, హెచ్. ఇ.ఓ సతీష్ కుమార్,ఆరోగ్య పర్యవేక్షకులు, వెంకటేష్,సులోచన, హేమలత, ఆశా కార్యకర్త లు, వివిధ గ్రామాల నుండి వచ్చిన టి.బి ఛాంపియన్ లు మరియు ఇంపాక్ట్ ఇండియా సంస్థ డిస్ట్రిక్ట్ లీడ్ రవి, డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ డి. అనిల్ లు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

## ప్రధానోపాధ్యాయు గడ్డం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత పాటుపడాలని ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండాపూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై నాటికను విద్యార్థుల చేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత పోకడ చూస్తుంటే జీవితమంటేనే మత్తు. మత్తులోనే వుంది గమ్మత్తు అనుకుంటున్నారు. నిజానికి జీవితమంటే మత్తు కాదు. జీవితాన్ని చిత్తు, చిత్తుగా ఓడించేది మత్తు అనే నిజాన్ని యువత తెలుసుకోవాలని అన్నారు. డ్రగ్స్ వాడినట్టు, అమ్మినట్టు తెలిస్తే మన రాష్ట్రం లో కొత్తగా అమల్లోకి వచ్చిన ఎమర్జెన్సీ నెంబర్112కు తెలిపినట్లైతే తగు చర్యలు పోలీసులు తీసుకుంటారని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీకి విద్యార్థి ఎంపిక



**ప్రజాపక్షం/కొత్తపల్లి:**రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలకు సెయింట్ జార్జి సిబిఎస్ఈ విద్యార్థి ఎంపికైనట్లు చైర్మన్ డాక్టర్ ఫాతిమారెడ్డి తెలిపారు. కొత్తపల్లి సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎన్.కార్తికేయ యాదవ్ ఈ నెల 24న జిల్లాలోని అంతర్గాం గ్రామంలో జరిగిన జిల్లాస్థాయి జూనియర్ లెవెల్ ఫుట్‌బాల్ సెలక్షన్స్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి పోటీలు 28 జూన్ నుంచి నిజామాబాద్‌లో జరగనున్నట్లు తెలిపారు. ఈ సంధర్భంగా చైర్మన్ డా.పి.ఫాతిమారెడ్డిమాట్లాడుతూరాష్ట్రస్థాయికి ఎంపికైనందుకు కార్తికేయను అభినంది స్తూ ధ్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ ఒదుండాలని సూచించారు. దీంతో శారీరక, మానసికదృఢత్వంఏర్పడుతుందన్నారు. కోచ్‌రవికుమార్,ప్రిన్సిపాల్‌ప్రియదర్శిని,విద్యార్థికి ఎంతో సహకరించిన తల్లిదండ్రులను అభినందించారు.

# డబ్బుల కోసం బెదిరించిన విలేకరిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/వీణవంక:** డబ్బుల కోసం డిమాండ్ చేసి బెదిరించిన నేటి సాక్షి క్రైం రిపోర్టర్ తడిగొప్పుల ప్రశాంత్‌పై కేసు నమోదు చేసిన సంఘటన వీణవంకలో చోటు చేసుకుంది. వీణవంక మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సంగె ప్రతాప్ అనే వ్యక్తి తన పొలం పక్కన కుంట నుంచి మట్టిని తన వ్యవసాయ భూమిలో పోసుకుంటున్న క్రమంలో వొద్నాల కిరణ్, చిలువేరు కుమారస్వామి, తడిగొప్పుల ప్రశాంత్‌లు బెదిరింపులకు గురిచేశారు. తమకు రూ.5 వేలు ఇవ్వకపోతే తహసీల్దార్‌కు చెబుతామంటూ హెచ్చరించారు. అందుకు ప్రతాప్ ఒప్పుకోకపోవడంతో తన నేటి సాక్షి న్యూస్ పేపర్‌లో కథనాలు రాసి తప్పుడు కేసులు పెట్టిస్తానంటూ భయభ్రాంతులకు గురిచేశారని, ఉన్నతాధికారులంతా తెలుసంటూ బెదిరించారని సంగె ప్రతాప్ ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/కొత్తపల్లి:**అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్‌లో సిద్దార్థ్ పాఠశాల నుంచి లారీ అసోసియేషన్ చౌరస్తా వరకు తీగలగుట్టపల్లిలోని ఎస్‌విజెసి కాలేజీ నుంచి తీగలగుట్టపల్లి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం అనేక రుగ్మతలకు కారణమవుతుందని, ఊపిరితిత్తులు, కేంద్ర నాడి వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని, రక్తపోటు పెంచడం, కాలేయం, గుండె సంబంధిత వ్యాదులు వస్తాయని చెప్పారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ.లక్ష్మారెడ్డి, సిబ్బంది, తదితరులున్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన ర్యాలీ

**ప్రజాపక్షం/చొప్పదండి:**ప్రపంచ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చొప్పదండి మండల కేంద్రంలో చొప్పదండి పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల విధ్యార్థులు, యువకులతో రెవెన్యూ శాఖ, మండల పరిషత్, విద్యాశాఖ ఉద్యోగుల సహకారంతో మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అవగాహన పరివర్తన ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎస్ఐ నరేష్ రెడ్డి మాట్లాడుతూ విధ్యార్థులు, యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తు పధార్థాలకు బానిస కావద్దని, మంచి ఆలోచనలతో జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడివో వేణుగోపాల్, ఎంఈవో మోహన్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు మోహన్ రెడ్డి, త్రిపాల్ సింగ్, అన్ని పాఠశాలల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈతచెట్లను నరికివేస్తే చర్యలు తప్పవు..

## ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్‌గౌడ్

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:**ఈతచెట్లను నరికివేస్తే చర్యలు తప్పవని ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.అనుమతి లేకుండా ఎవరైన ఈత చెట్ల వనాన్ని నరికితే చర్యలు తప్పవన్నారు.మండలంలోని అల్మాస్‌పూర్ తండాకు చెందిన సర్వేనంబర్ 131(అ/ఎ/ఎ) గల భూమిలో ఈతచెట్లను అనుమతి లేకుండా దున్నిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఈత చెట్లను తొలగించిన భూయజమాని గురిజాల అనీల్‌రెడ్డి,మల్లారెడ్డి,ట్రాక్టర్ డ్రైవర్ దరావత్ లక్ష్మ ణ్‌లపై కేసునమోదు చేసినామని మీడియాతో శ్రీనివాస్ గౌడ్ అన్నారు.చట్టవిరుద్ధంగా ఎవరైన ఈత,తాటి చెట్లను నరికితే కేసులు తప్పవని అన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం నిర్మించడమే లక్ష్యం

### హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి. గితే, అధికారులు




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : విద్యార్థులు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. యాంటీ డ్రగ్ డే సందర్భంగా మత్తుపదార్థాల నిర్మూలన వారోత్సవాలలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే, విద్యార్థులు, పోలీస్ అధికారులతో కలిసి గురువారం సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ నుంచి పద్మనాయక ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలను ఆకట్టుకుంటూ ఆలోచింపచేసేలా ఉన్న గంజాయి రహిత సమాజం–మనందరిబాధ్యత డ్రగ్స్ కి నో చెప్పండి ఆరోగ్యమే అసలైన సంపద వంటి ప్లకార్డ్స్, నినాదాలు చేశారు.డ్రగ్స్,గంజాయిని నిర్మూలించేందుకు బాధ్యత గల పౌరులుగా వ్యవహరించి డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని ప్రజలు,యువతకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ విద్యార్థులు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండి పక్కా ప్రణాళిక ప్రకారం చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు. డ్రగ్స్ ను వినియోగించి సమాజానికి ఇబ్బంది కలిగించే పౌరులుగా మారవద్దని పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగంతో మెదడు, కిడ్నీలు, ఊపిరితిత్తులు దెబ్బతింటాయని రాను రాను ఆరోగ్యం క్షీణిస్తుందని వివరించారు.అనంతరం ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ విద్యార్థులు, యువత తమ పరిసరాలు, విద్యాలయాలు ఇతర చోట్ల ఎక్కడైనా డ్రగ్స్ వినియోగించినా.. విక్రయించినా తరలించనా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యాంటీ డ్రగ్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన ఇతర పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, పతకాలను కలెక్టర్, ఎస్పి తదితరులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి,అదనపు ఎస్పీ చంద్రయ్య, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సి.ఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, నటేష్,మధుకర్, నాగేశ్వరరావు, ఆర్.ఐ లు రమేష్, మధుకర్, యాదగిరి, ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు పేరు ఓటర్ లిస్ట్ నుండి తొలగింపు

ప్రజాపక్షం/ వేములవాడ: వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు పేరును ఓటర్ జాబితా నుండి తొలగించడానికి రెవెన్యూ శాఖ చర్యలు ప్రారంభించింది. ఇటీవలే తెలంగాణ హైకోర్టు ఇచ్చిన కీలక తీర్పు మేరకు, చెన్నమనేని రమేష్ భారత పౌరుడు కాదని ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వేములవాడలోని ఆయన నివాసానికి రెవెన్యూ అధికారులు ఫారమ్ 7 ప్రకారం నోటీసు అందజేశారు. రిజిస్ట్రార్ పోస్టు ద్వారా పంపిన ఈ నోటీసులో ఓటర్ జాబితా నుండి ఆయన పేరు తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో పేరు తొలగింపుపై రమేష్ బాబు వీటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే జూలై 2వ తేదీ లోగా సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసిన అధికారులు. ఈ నోటీసులు తెలంగాణ హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఎన్నికల శాఖ ఆదేశాలతోనే జారీ చేసినట్లు రెవెన్యూ శాఖ వెల్లడించింది. ఇంతవరకూ ఈ వార్తపై చెన్నమనేని రమేష్ బాబు స్పందన వెలువరించలేదు.

## హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

ప్రజాపక్షం/రామడుగు:మండలంలోని దేశరాజుపల్లి గ్రామ రెవెన్యూ శివారులోని సర్వే నెంబర్ 407/2 సీలింగ్ భూమిలో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డును గురువారం ఏర్పాటు చేశారు. ఈ మేరకు భూభారతి చట్టంలో భాగంగా దేశరాజుపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సర్వే నెంబర్ 407లోని 1.37 ఎకరాల సీలింగ్ భూమిని అక్రమంగా పట్టాలు చేసుకున్నారని, వెంటనే ప్రభుత్వం స్వాధీన పరుచుకుని, గ్రామ అవసరాలకు, భూమి లేని నిరుపేదలకు కేటాయించాలని గ్రామస్తులు తహసీల్దార్ రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సీలింగ్ భూమిలో ఎలాంటి క్రయ విక్రయాలు, కట్టడాలు జరిపినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డును రెవెన్యూ సిబ్బందితో గురువారం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, నాయ కులు తహసీల్దార్ రాజేశ్వరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా గ తంలో ఏర్పాటు చేసి న హెచ్చరిక బోర్డు రాత్రికి రాత్రే మా య మవడం, తిరిగి ప్రస్తుతం హెచ్చరిక బోర్డును ఏర్పా టు చేయడంపై గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఏదైనా ప్రభుత్వం సీలింగ్ భూమిని స్వా ధీనం చేసుకుని గ్రామ అవసరాలకు వినియోగించాలని గ్రామస్తులు, నాయకులు, యువకులు అధికారులను కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అక్రమాలు





ప్రజాపక్షం/కరీంనగర్:కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెడతామని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హెచ్చరించారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం మానకొండూర్‌లో నిర్వహించిన మహాధర్నా కార్యక్రమానికి బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావుతో కలిసి రసమయి బాలకిషన్ హాజరయ్యారు. ప్లకార్డులతో ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. రసమయి మాట్లాడుతూ అబద్ధాల వాగ్దానాలపై గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 18 నెలలైనా ఇచ్చిన హామీలు, గ్యారంటీలను అమలు చేయడం లేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మరో నాటకానికి తెరలేపాడని మండిపడ్డారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్లను పైసలు, పొలాలు, ఇండ్లు, బండ్లు ఉన్నోళ్లకే కేటాయించారన్నారు. ఏమీ లేనోళ్లకు ఒక్క ఇల్లు సైతం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బెజ్జంకి మండలం గుండారంలో 26 మంది ఎస్సీ కుటుంబాలు ఉంటే ఒక్క కుటుంబానికి సైతం ఇండ్లు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి తన సొంత గ్రామమని చెప్పుకుంటున్న మానకొండూర్ మండలం పచ్చునూర్‌లో ఎంతమంది ఎస్సీ కుటుంబాలకు ఇండ్లు కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం కరువయ్యిందన్నారు. రాష్ట్రంలో ఫ్యాక్షన్ పాలన నడుస్తోందని విమర్శించారు. పోలీసుల అనుమతితో శాంతియుతంగా ధర్నా చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు అడ్డుకునేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు,మాజీప్రజాప్రతినిధులు,కార్యకర్తలున్నారు.

### లబ్ధిదారులతో కాంగ్రెస్ ఆందోళన

ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీకి చెందిన, అనర్హులకు కేటాయించారంటూ బిఆర్ఎస్ చేపట్టిన మహాధర్నాపై కాంగ్రెస్ కౌంటర్ అటాక్ చేసింది. ప్రతిగా ఇందిరమ్మ లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ మండల కార్యదర్శి నందగిరి రవీంద్రచారి ఆధ్వర్యంలో ఆందోళనకు దిగింది. మాజీ ఎమ్మెల్యే రసమయి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సొంతింటి కలను సాకారం చేస్తుంటే గిట్టని బిఆర్ఎస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులను బిఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులతో కలిసి రావడంతో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. రాస్తారోకోతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ధర్నాకు బిఆర్ఎస్ అనుమతి తీసుకోగా కాంగ్రెస్ ఆందోళనను గమనించి పోలీసులు భారీగా మోహరించారు. బిఆర్ఎస్ మహాధర్నాకు పూనుకోక ముందే కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులతో కలిసి ఆందోళనకు దిగడంతో పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## గోశాల నూతన సిబ్బందికి నియామక పత్రాల అందజేత

### జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి



ప్రజా పక్షం/ వేములవాడ టౌన్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి సంబంధించిన గోశాలలో పనిచేయుట కోసం నియమించిన సిబ్బందికి నియామక పత్రాలను పంపిణీ చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో 40 మందికి గాను 38 మంది సిబ్బందికి గురువారం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. వారిని శుక్రవారం నుంచి విధులకు హాజరు కావాలని సూచించారు. దానిలో కోడెల కోసం పచ్చిగడ్డి పెంచాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించగా జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్లతో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గురువారం హన్మక్కపల్లి, మర్రిపల్లిలో కేటాయించిన స్థలాలను పరిశీలించారు.

## మాదక ద్రవ్యాలు అలవాటైతే బంగారు భవిష్యత్ నాశనం

ప్రజాపక్షం/గొల్లపల్లి : మాదక ద్రవ్య దుర్వినియోగం ,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం లో భాగంగా గొల్లపల్లి పోలీస్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి,ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్‌తో దేశ భవిష్యత్ నాశన మవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చిర్ర సతీష్ ,జడ్పీహెచ్ఎస్( బి )పాఠశాల ప్రధానోపా ధ్యాయులు రాజేంద్ర కుమార్ ,అనిత ,విజయ్ కుమార్ ,జమున, రచన, స్వరూప, మధు, భానుప్రకాష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణ సాగర్ రెడ్డి



ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం నూతన సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్సై ) గా గురువారం ఎం . కృష్ణ సాగర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకుముందు నిర్మల్ జిల్లా కడెం మండల పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహించినారు.ఇప్పటి వరకు గొల్లపల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన చిర్ర సతీష్ జగిత్యాల జిల్లా స్పెషల్ బ్రాంచికి బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదులకు సమన్యాయం అందిస్తానని తెలిపారు.పోలీస్ సిబ్బంది నూతన ఎస్సై కి శుభాకాంక్షలు తెలిపారు.బదిలీపై వెళ్తున్న ఎస్సై సతీష్ ను పోలీస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

## రికార్డు స్థాయిలో నృసింహుడి హుండీ ఆదాయం

ప్రజాపక్షం / ధర్మపురి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో గురువారం హుండీలను విప్పి లెక్కింపు జరుపగా రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్ తెలిపారు. తేది : 2132025 నుండి తేది 2662025 వరకు 98 రోజులకు సంబందించిన హుండీలను విప్పి లెక్కించగా రూ.71, 53,190 నగదు, మిశ్రమ బంగారం 68 గ్రాములు, మిశ్రమ వెండి 7 కిలోల 400 గ్రాములు, 32 విదేశీనోట్లు ఆదాయంగా వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. దేవస్థానం చరిత్రలో 98 రోజులలో ఇంతటి ఆదాయం గతంలో ఎప్పుడూ రాలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కమిషనర్ నాయిని సుప్రియ, ఆలయ ఈఓ ఎస్.శ్రీనివాస్, ధర్మకర్తలు ఎదులాపురం మహేందర్, బొల్లారపు పోచయ్య, స్తంభంకాడి గణేష్, గుడ్ల రవీందర్, కొమురెల్లి పవన్ కుమార్, వొజ్జల సౌజన్య నరేందర్, అవ్వ సుధాకర్, ఉప ప్రధాన అర్చకులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు నేరెళ్ల శ్రీనివాసచార్యులు, సూపరింటెండెంట్ డి.కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## అతిసార వ్యాధిపట్ల అప్రమత్తం



ప్రజాపక్షం/జమ్మికుంట:జమ్మికుంటలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రంలో గల అంగన్వాడీ కేంద్రాలలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అతిసార వ్యాధి నిరోధక అవగాహన కార్యక్రమాన్ని హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి నిర్వహించారు. ఈ సంధర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో కలుషిత త్రాగునీరు, అపరిశుభ్రత వాతావరణంతో డయేరియా , ఇతర వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఐదేళ్ల లోపు పిల్లలందరికీ ఓఆర్ఎస్ పాకెట్స్, జింకు మాత్రలను ముందస్తు చర్యల్లో ఇవ్వడం జరుగుతుందన్నారు. సూపర్వైజర్ సదానందం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు, ఏఎన్ఎం రమ, అంగన్వాడీ టీచర్ హాజరత్, పాఠశాలు పాధ్యాయులు శిరీష, ఆశా కార్యకర్త మణి, విద్యార్థులున్నారు.

# యువత భవిష్యత్తును మత్తు చిత్తు చేస్తుంది

### అదనపు కలెక్టర్ డి.వేణు




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి** : యువత చెడు మార్గాల పట్ల ఆకర్షితం కాకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ డి.వేణు తెలిపారు.గురువారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు , డిసిపి కరుణాకర్ తో కలిసి ఐటిఐ గ్రౌండ్స్ నుంచి నందన గార్డెన్స్ వరకు నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ యువత చెడు అలవాట్ల వైపు ఆకర్షితులైతే వచ్చే నష్టాలు, కుటుంబంలో మన తల్లిదండ్రులు, మన కుటుంబీకులు పొందే దుఃఖం అధికంగా ఉంటుందని, చెడు అలవాట్లకు మొదటి నుంచి దూరంగా ఉండాలని తెలిపారు. నేటి యువత రేపటి భావి భారత పౌరులని, వీరిలో కొంతమంది డ్రగ్స్ కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందని, దీనిని గుర్తించి డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన పెంచుకొని దూరంగా ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు.యువత డ్రగ్స్ తో పాటు, గుట్కా, గంజాయి, మాదక ద్రవ్యాలు, సిగరెట్ మొదలగు చెడు అలవాట్లకు సైతం దూరంగా ఉండాలని, చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఆలోచనా విధానం ఆలోచన శక్తి నశిస్తాయని అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, క్రమశిక్షణ చాలా కీలకమని, వీటిని ఎట్టి పరిస్థితులలో కోల్పోవద్దని ఆయన పేర్కొన్నారు. . ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణా, జిల్లా సంక్షేమ అధికారి పి.వేణు గోపాల్ రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ , జిల్లా రవాణా అధికారి రంగా రావు,పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

26knr15p1

## ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

### డిటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఏభూషి శ్రీనివాస్



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:**తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ ఆద్వర్యంలో ఈ నెల 27న హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని డిటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఏభూషి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఇల్లందకుంట హైస్కూల్లో సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియామకం చేయాలని, ప్రతి పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు ఉండాలని డిమాండ్ చేశారు. పాఠశాలలలో పిల్లలు లేరనే నెపంతో పాఠశాలలను మూసి వేయడం సరికాదన్నారు. సమావేశంలో ఇల్లందకుంట డిటిఎఫ్ మండల అధ్యక్షుడు సంపత్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ .వేణు, ఉపాధ్యాయులు సమ్మిరెడ్డి, సత్యం, శంకర్, గోపి, రాధిక రాణి, ఉమాదేవి తదితరులున్నారు.

## స్కూల్ బ్యాగులు పంపిణీ

**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన ఉదారం శ్రీనివాస్ తన కూతురు కీ.శే. ఉదారం మాన్విత జన్మదినం పురస్కరించుకుని గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విధ్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. మూడేళ్ల క్రితం తన కూతురు స్కూల్ వ్యాన్ కింద పడి చనిపోగా తన జ్ఞాపకార్థం గత ప్రతి సంవత్సరం శ్రీనివాస్ తన కూతురు పుట్టినరోజు సంధర్భంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్నారు. ఈ సంధర్భంగా ప్రధానోపాధ్యాయుడు వీరేశం మాట్లాడుతూ శ్రీనివాస్ ఉదారత అభినందనీయమన్నారు. తన కూతురు జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకుంటున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, పాఠశాల పూర్వ విధ్యార్థులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఉదారం కనకచారి, బిసవేణి రాజశేఖర్ గౌడ్, మొండె కొమురయ్య, శ్రీనివాస్, ప్రకాష్, టీచర్లు సదాశివ, మధు, శ్రీలతలున్నారు.

## గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్ల పంపిణీ



**ప్రజాపక్షం/సుల్తానాబాద్** : గీత కార్మికుల రక్షణ ధ్యేయం గా ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కాటమయ్య రక్షణ కవచం కిట్ల పంపిణీ, శిక్షణ కార్యక్రమం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో సుల్తానాబాద్ ఎక్సైజ్, పెద్దపల్లి బిసి కార్పొరేషన్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్లుగా జాగిరి అంజి గౌడ్, తిరుపతి గౌడ్, ఇల్లందు రాజబాబు గౌడ్ గీతా కార్మికులకు శిక్షణ ఇచ్చారు.అనంతరం గీతా కార్మికులు కాటమయ్య రక్షణ కోసం కిట్ ఉపయోగించి తాడి చెట్టు ఏక్కి ప్రమాదం జరగకుండా ఏ విధంగా కాపాడుకోవచ్చును డెమో కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్థానిక హెచ్ డబ్ల్యు ఓ కేసరి శంకర్, ఎక్సైజ్ ఎస్సై రాజు, స్థానిక గౌడ సంఘం అధ్యక్షులు గడ్డం అంజయ్య గౌడ్, మంద రమేష్ గౌడ్, కొయ్యడ ఎల్లయ్య గౌడ్, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్ తో పాటు గీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సామాజిక సేవే వారి మార్గం

### దాతృత్వం చాటుకున్న అల్లం దంపతులు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్** : సామాజిక సేవే వారి మార్గం సహాయానికి మారు మారుపేరుగా నిలుస్తున్న దంపతులు అల్లం భాగ్యలక్ష్మి సత్యనారాయణ అనడంలో తప్పు లేదేమో, ఎవరైనా ఆపదలో ఉన్నారని తెలి యడమే ఆలస్యం క్షణం ఆలోచిం చకుండా సహాయం చేస్తారు. వీరి వాలకం చూస్తుంటే సహాయం చే యడానికి పుట్టారని అనిపిస్తుంది. ఎవరైనా సహాయం కావాలని తన గడప దాటితే ఉన్నదాంట్లో అడిగి నవారికి లేదనకుండా సహాయం చే యడంలో ముందుంటారు. సుల్తానా బాద్ మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో నివాస ముం టున్న అల్లం భాగ్యలక్ష్మి సత్య నారాయణ దంపతులు సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆ యుర్వేద వైద్యశాలకు వచ్చే రోగులకు త్రాగడానికి నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయుర్వేద వైద్యులు రావణ వేణి ప్రభాకర్ అల్లం దంపతుల దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ఆసుపత్రికి వచ్చే రోగులకు స్వచ్ఛమైన నీరందించేందుకు వాటర్ ఫిల్టర్,కుర్చీలు అందజేశారు. అలాగే నాలుగు నెలల క్రితం కరెంట్ ను పునర్ధరించి రోగులకు ఇబ్బంది కాకుండా తన సేవను చాటుకున్నాడు. ఈ సందర్భంగా ఆయనను ఆయుర్వేద వైద్యశాల మెడికల్ ఆఫీసర్ రావణ వేణి ప్రభాకర్,ఆయుష్ ఫార్మసిస్ట్ ఉమామహేశ్వరి, ఎస్ ఎన్ ఓ లక్ష్మ ణ్ లు శాలువాతో ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

## బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా రమేష్

**ప్రజాపక్షం / మల్లాపూర్ :** మల్లాపూర్ మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పాతదామరాజ్ పల్లి గ్రామానికి చెందిన ఎనుగందుల రమేష్ నియమితులయ్యారు. ఆదివారం జరిగిన బిసి ముఖ్య నాయకుల సమావేశంలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో రమేష్ నియామకమయ్యారు. వివిధ సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములై బీసీలను చైతన్యపరిచినందుకు ఉద్యమాల్లో పాల్గొన్నందుకు రమేష్ సేవలను గుర్తించి మల్లాపూర్ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించగ రాష్ట్ర కార్యదర్శి మూసి పట్ల లక్ష్మీ నారాయణ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను అందుకున్నారు.తన నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర, బీసీ సంక్షేమ సంఘం నాయకులకు రమేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ బీసీల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తానని తెలిపారు. కాగా వీరి నియామకం పట్ల బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామచందర్ , మండల బీసీ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## గ్రంథాలయంలో వనమహోత్సవం

**ప్రజాపక్షం / ధర్మపురి:** ధర్మపురి పట్టణంలోని గ్రంథాలయ ఆవరణలో గురువారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు.ధర్మపురి మున్సిపల్ తాజా మాజీ ఫ్లోర్ లీడర్ వేముల నాగలక్ష్మి , కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్ లు పాల్గొని రావి,వేప తదితర మొక్కలను నాటారు.విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్,బిల్లకూరి శేఖర్, పాయిల శరత్,వార్డు అధికారులు పాల్గొన్నారు

## ఎంఆర్‌పిఎస్ జెండా గద్దె నిర్మాణానికి శంకుస్థాపన

### ఎంఆర్‌పిఎస్ రూరల్ మండల అధ్యక్షుడు దాసరి సతీష్ మాదిగ



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో గురువారం ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు మల్యాల జీవన్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ జెండా గద్దె నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు దాసరి సతీష్,సీనియర్ నాయకులు నక్క సతీష్ మాదిగ హాజరై..మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జూలై 07న గ్రామ గ్రామాన జండా గద్దలు నిర్మించాలిని కోరారు.అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం కోసం భారతదేశంలో సామాజానికి సేవ చేయడం కోసమే పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, మరో పోరాటానికి శ్రీకారం చుట్టబోతున్నారు తెలిపారు.ఈ కార్యక్రమంలో రూరల్ మండల ప్రధాన కార్యదర్శి నలువాల లక్ష్మ ణ్, దుమల రాజేష్,మల్యాల పెద్ది రాజాం,కలల లచ్చం,నక్క వంశీ,ఒడ్డెమ్ శ్రవణ్, దగుల యోగేందర్,నక్క విష్ణు,నక్క అభి, చందు, రిషి,తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

**ప్రజాపక్షం/సారంగపూర్:** జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం అర్పపెల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ బోగ గంగారాం అల్లుడు సత్తయ్య గుండెపోటుతో మరణించగా వారి పార్థివ దేహానికి గురువారం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండ్ర రామచంద్రారెడ్డి, నాయకులు పూర్ణచందర్‌రెడ్డి, అప్పం స్వామి తదితరులు ఉన్నారు

## బిసి న్యాయవాదుల సంక్షేమ సంఘం

### జిల్లా అధ్యక్షుడిగా కుర్మాచలం ఉమామహేష్

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** బిసి ముఖ్య నాయకులలు ఆర్ క్రిష్ణయ్య రాజ్యసభ సభ్యులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా, జగిత్యాల జిల్లా బిసి న్యాయవాదుల సంక్షేమ సంఘం జిల్లా అ ధ్యక్షునిగా కుర్మాచలం ఉమామహేష్ నియమించడం జరిగింది. వివిధ సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యులై, గత 15 సంవత్సరాల నుండి బిసి సంక్షేమ సంఘంలో వివిధ హోదాలలో పదవులను నిర్వహించి, బీసిలను చైతన్యపరిచినందుకు బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు నీలం వెంకటేష్ మేరకు తానని నియమించడం జరిగింది. ఉమామహేష్ నియామకం 27వ తేదినుండి అమల్లోకి వచ్చునని రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీ నారాయణ తెలిపారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మహిళలు గురువారం బోనాలు తీసుకెళ్లి పోచమ్మ (పోలేరమ్మ) బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు .అమ్మవారికి నైవేద్యం సమర్పించారు .ఇంటి నుండి మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుళ్లతో సంఘ సభ్యులు ,యువకులు నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రదక్షిణలు చేసి ఒడి బియ్యంతో పాటు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు . సంఘ సభ్యులు మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి ,పశు సంపదతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు .ఈ వేడుకల్లో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శ్రీ కోటి భూమయ్య ,వెంగలాపూర్ మాజీ సర్పంచ్ బలభక్తుల అనిత కిషన్ ,దేవరకొండ శ్యాంసుందర్ ,ఇదిలాపురం భాస్కరాచారి ,రాజ గణేష్ ,కరుణాకర్ ,కుమార్ ,నిరంజన్ ,రాజన్న చారి ,మహిళలు ,సంఘ సభ్యులు,యువకులు తదితరులు పాల్గొన్నారు .

## టెంట్ హౌస్ యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

**ప్రజాపక్షం / జన్నారం :**జన్నారం మండల టెంట్ హౌస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జన్నారం పట్టణానికి చెందిన పర్ల శంకర్ ఎంపికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా మెంగని సదన్న, ప్రధాన కార్యదర్శిగా ముంజంపల్లి సాయి కుమార్, కోశాధికారిగా నిమిషకవి రాజేందర్, ఉపాధ్యక్షులుగా కందుల రాజేందర్, సామల్ల లక్మీ రాజం, ప్రచార కార్యదర్శులుగా సంగ అంజిత్, తాటి రాజేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, సంఘంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తాం. సభ్యుల అభ్యున్నతికి, సంఘం అభివృద్ధికి నిబద్ధతతో ముందుకు వెళ్లతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల టెంట్ హౌస్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## మాలీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/కెరమెరి :**కెరమెరి మండల మాలీ సంక్షేమ సంఘం నూతన కమిటీని గురువారం మండల కేంద్రంలోని సావిత్రి బాయి పూలే భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా కొట్రాంగే తిరుపతి, ఉపాధ్యక్షుడిగా మొహర్లే నాగేశ్ ఎంపికయ్యారు. కమిటీ సభ్యులుగా మొహర్లే శ్రీధర్, మందాడే శివరాం, కొట్రంగే పోశెట్టి, సోనులే సోము, మాండోర్ బాజీరావు, గౌత్రే శంకర్, అధే ముకుందరావు, మొహర్లే ధివంజీ, కోటరంగే చందు, చతరే దత్తు, మొహర్లే సుభాష్, మండోరే బాజీరావ్, కోటాంగే హన్మంతు, అధే శంకర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తిరుపతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిజేశారు. మాలీ కులస్తుల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తాను అని పేర్కొన్నారు. తిరుపతిని నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్న సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెండే సాకారం, సెండే నారాయణ్, మొహర్లే శంకర్, కొట్రంగే హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి విద్యార్థిని అభినందించిన కలెక్టర్




**ప్రజాపక్షం /బాన్సువాడ :**బాన్సువాడ పట్టణంలోని వాసవి పాఠశాలకు చెందిన విద్యార్థి నిఖిల్ గౌడ్ ఇటీవల మాదకద్రవ్యాల నిర్మూలనపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థిని అభినందించి బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ఆయన అభినందించారు.

# డ్రగ్స్ నిర్మూలనలో యువత పాత్రం కీలకం

### న్యాయమూర్తి అజయ్ ఉల్లాం




**ప్రజాపక్షం/సిర్పూర్ టి :**యువతను డ్రగ్స్ మత్తు పదార్థాల ఉచ్చు నుండి రక్షించడం, వారికి అవగాహన పెంచడం, ఆరోగ్యకర సమాజ నిర్మించడం లక్ష్యంగా రూపొందించిన ప్రత్యేక ఎజెండాను అందరితో పంచుకుంటున్నామని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ ఉల్లాం తెలిపారు. గురువారం సిర్పూర్ టి మండల కేంద్రంలోని స్థానిక కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతకు చిన్నతనం నుంచే మత్తు పదార్థాల భయంకర ఫలితాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్ దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ అంశాన్ని విద్యా ప్రణాళికలో భాగంగా తీసుకొని, విద్యార్థుల మానసిక స్థితిగతులను సమర్థంగా నిర్మించేందుకు సమాజం ముందుకు రావాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహపూర్వకంగా మెలిగి వారి ప్రవర్తనపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని, అనుమానం కలిగిన వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ రవాణా, విక్రయాన్ని అరికట్టేందుకు పోలీసులు, న్యాయవ్యవస్థ సమన్వయంతో పనిచేస్తున్నాయని, నేరస్తులకు కఠిన శిక్షలు అమలు చేసేలా చట్టాలను అమలు చేస్తున్నామన్నారు. డ్రగ్స్ నిర్మూలన అనేది కేవలం ప్రభుత్వం, పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. యువత తమ బాధ్యతను గుర్తించాలి, డ్రగ్స్ అనే మహమ్మారిని ఎదుర్కొనే ముందడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐలు, ఎస్ఐలు కమలాకర్, సురేష్ కుమార్, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మోదీ పాలనలో అభివృద్ధి పథకాలు అనేకం

### బిజెపి నేత అమిరిశెట్టి



**ప్రజాపక్షం/మంచిర్యాల :**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో పేదల సంక్షేమం, దేశ అభివృద్ధి దిశగా అనేక పథకాలు అమలు చేశారని బిజెపి గర్మిల్ల జోన్ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజు కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం మంచిర్యాల కాలేజీ రోడ్‌లోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గల స్వామి వివేకానంద విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం ఉచిత రేషన్ పథకం (ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన), ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్లు (హర్ ఘర్ జల్ యోజన), సురక్ష భీమా యోజన, వీధివ్యాపారుల కోసం స్వనిధి రుణాలు, పంటలకు భీమా (ఫసల్ భీమా యోజన), రైతులకు ఏడాదికి 6,000 ఆర్థిక సాయం (కిసాన్ సమ్మన్ నిధి), ఆరోగ్య సేవలకు ఆయుష్మాన్ భారత్ కార్డ్ వంటి పథకాలతో కేంద్రం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచింది'' అని వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శి మేరడికొండ శ్రీనివాస్, బింగి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముల్కల్ల మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడుఆకులఅశోక్‌వర్ధన్, తదితరులు పాల్గొన్నా రు.

# గంజాయి రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి




**ప్రజాపక్షం /జన్నారం :**భావితరాలకు ఆదర్శంగా నిలవాలని, గంజాయి రహిత సమాజ నిర్మాణం కోసం నేటితరం బాధ్యతగా వ్యవహరించాలని జన్నారం ఎస్ఐ అనూష పేర్కొన్నారు. గురువారం జన్నారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసుల ఆధ్వర్యంలో బాలుర పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వద్దు, జీవితం ముద్దు' అనే నినాదంతో బస్టాండ్ వరకు విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనూష మాట్లాడుతూ డ్రగ్స్, మాదకద్రవ్యాల మహమ్మారిని సమాజం నుండి తరిమికొట్టాలి. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి.

మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని, ఉన్నత లక్ష్యాలతో సక్రమ దిశగా ముందడుగులు వే యాలని, మెరుగైన సమాజ నిర్మాణానికి యువతరం ప్రేరణగా మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, పిఇటి యాకూబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిఐ, ఎస్ఐలను కలిసిన మాలీ సంఘం నూతన కమిటీ



**ప్రజాపక్షం/ కెరమెరి :**ప్రతి ఒక్కరూ శాంతి భద్రతలకు సహకరించాలని సిఐ సత్యనారాయణ, ఎస్ఐ మధుకర్ కోరారు. కెరమెరి మండల మాలీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు గురువారం పోలీస్ స్టేషన్‌లో సిఐ, ఎస్ఐలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు కోట్రాంగే తిరుపతి, ఉపాధ్యక్షుడు నగేశ్, కమిటీ సభ్యులు శ్రీధర్, శివరాం, బాజీరావు, బాలాజీ, సాకారం, సోనేరావు తదితరులు పాల్గొన్నారు.

## బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/వాంకిడి :**వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బుధవారం బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దుర్గం దుర్గాజి, ప్రధాన కార్యదర్శిగా ఉప్రే విజయ్, సమాజ అధ్యక్షులుగా శ్యాం రావు లహుజి దుర్గే, రాజేశ్వర్ ఉప్రే ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సమావేశం నిర్వహించి, నూతన బాధ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాట్లాడిన వారు, జులై 10 నుండి ప్రారంభమయ్యే వర్ష వాస్ కార్యక్రమాన్ని అందరూ కలసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వర్ష వాస్ ప్రారంభ రోజైన జులై 10న బుద్ధునితో ప్రయాణం అనే తెలుగు నాటికను వాంకిడి మండల కేంద్రంలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాహుల్కర్, గౌరవ అధ్యక్షుడు జై రామ్ ఉప్రే, సమతా సైనిక్ దళ్ జిల్లా బాధ్యులు దుర్గం సందీప్, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు ,నాయకులు , సమాజ అధ్యక్షుడు రాజేశ్వర్ ఉప్రే, సిద్ధార్థ యువజన సంఘ నాయకులు మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ పంపిణీ

**ప్రజాపక్షం/హాజీపూర్:**రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభ్యాసానికి తోడ్పాటుగా ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి తెలిపారు. గురువారం హాజీపూర్ మండలంలోని బాబా నగర్ మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఈ విద్యా సంవత్సరం నుండి ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. అందరూ ఈ నోట్ బుక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత నోట్ బుక్స్ అందడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్, సంగీత పాల్గొన్నారు.

## రోడ్లపై పశువుల నియంత్రణ

### ఎస్ఐ కమలాకర్ హెచ్చరిక

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :**ప్రధాన రోడ్లపై పశువులు తిరుగడం వల్ల ప్రమాదాలకు దారి తీయవచ్చని, వాటి యజమానులు బాధ్యతతో వ్యవహరించాలని సిర్పూర్ టి ఎస్ఐ కమలాకర్ హెచ్చరించారు. గురువారం సిర్పూర్ టీ మండల కేంద్రంలో రోడ్లపై సంచరిస్తున్న పశువులను గమనించిన ఎస్ఐ సంబంధిత యజమానులకు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కమలాకర్ మాట్లాడుతూ, పశువులను రోడ్లపై వదిలేయడం వల్ల ప్రజలకు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. రోడ్లపై సంచరించే పశువుల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముందని, పశువులను నియంత్రణలో ఉంచకపోతే చట్టపరమైన చర్యలు తప్పవు అని పేర్కొన్నారు. అజాగ్రత్త కారణంగా అపాయాలెదుర్కొనే పరిస్థితులు ఏర్పడకముందే యజమానులు జాగ్రత్త వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## గంజాయి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

### ఎస్ఐ మేకల సంతోష్ పిలుపు




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:**భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్న సంకల్పంతో నేటితరం గంజాయి రహిత సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు శ్రీరాంపూర్ ఎస్ఐ మేకల సంతోష్. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఐటిఐ విద్యార్థులతో కలిసి డ్రగ్స్ వద్దు – జీవితం ముద్దు అనే నినాదంతో బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మేకల సంతోష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల రూపంలో సమాజంలో పెరుగుతున్న మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలి. యువత అసాంఘిక చర్యలకు దూరంగా ఉండి, మత్తు పదార్థాలకు బానిసలవకుండా ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి. పోలీసు సిబ్బంది, ఐటిఐ విద్యార్థులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న స్కూల్‌ను మూసివేయాలి

భారతీయ విద్యార్థి మోర్చా నాయకులు




**ప్రజాపక్షం/పిట్లం:**పిట్లం మండలకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిబందనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలను వెంటనే మూసివేయాలని కోరుతూ భారతీయ విద్యార్థి మోర్చా నాయకులు మండల విద్యాశాఖ అధికారికి గురువారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు అర్బాస్ ఖాన్ మాట్లాడుతూ వారు పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పిట్లంలో ఏర్పాటు చేసిన ఢిల్లీ పబ్లిక్ పాఠశాల పబ్లిక్ అనే పేరు తోక తలిగించి విద్యార్థుల తల్లి తండ్రులను మోసం చేస్తున్నారని, ఇష్టానుసారంగా ఫీజులు వసూల్, పుస్తకాలు, టై, బెల్టు వ్యాపారం చేస్తున్నారన్నారు. మౌళిక వసతులు కల్పించకుండానే నిర్వహిస్తున్న ఈ పాఠశాల అనుమతిని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిట్లం ఇంచార్జీ శేఖర్, ప్రసన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

## తండాల బాటపట్టిన విద్యాశాఖ అధికారి

**ప్రజాపక్షం/నిజాంసాగర్:**మహ్మద్‌నగర్ మండల విద్యాశాఖ అధికారి అమర్‌సింగ్ విద్యార్థుల కొరకు గురువారం మండలంలోని ఆయా తాండాల బాట పట్టారు. తమ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవితకు బాటలు వేయాలని తల్లితండ్రులను కోరారు. మండలంలోని కొనాతాండా, నడిమితాండా, గిర్నితాండా పాఠశాలల ప్రధానోపాధ్యాయిని లక్ష్మి తో కలిసి తాండాలలో పర్యటించారు. పలువురు విద్యార్థుల తల్లితండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలతో పాటు సన్నబియ్యం, రుచికరమైన కూరగాయలతో నాణ్యమైన భోజనం పెట్టి వారు ఆరోగ్యవంతులుగా ఉండేలా చర్యలు చేపట్టిందని, ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లితండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను బడికి పంపించాలని కోరారు. అనంతరం కొనాతాండా పాఠశాలలో మద్యాహ్న భోజనాన్ని ఎంఈఓ పరిశీలించారు. ఈ కార్యక్రమలో తాండాపెద్దలు సవాయిసింగ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థినికి కలెక్టర్ ప్రశంసలు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:**మాదక ద్రవ్యాల వలన కలిగే చెడు పరిణామాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా ఈ పోటీల్లో నిజాంసాగర్ మండలం అచ్చంపేట్ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని నిషిత తృతీయ బహుమతి సాధించారు. ఈ మేరకు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సదరు విద్యార్థినిని కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించడమే కాకుండా బహుమతిని అందజేస్తూ గైడ్ టీచర్ జయపాల్‌ను సైతం కలెక్టర్ అభినందించడం జరిగింది.

# భూమిపై హక్కును హరించారు..

**ప్రజాపక్షం/చెన్నూరు:**జాయింట్ పట్టాలో హక్కుదారుడు బతికే ఉన్నా, అక్రమ మార్పులు చేశారు... మా భూమిని దోచేశారు'' అంటూ కోటపల్లి మండలం పుల్లగాం గ్రామ భాదితులు ఆవేదన వ్యక్తం చేశారు. వారికి తగిన సమాచారం లేకుండా, నిబంధనలను తుంగలో తొక్కుతూ రెవెన్యూ అధికారులు కాసుల కోసం కక్కుర్తి పడి భూమిపై హక్కులను హరించారని ఆరోపిస్తున్నారు. తాజాగా ఒక అధికారపార్టీ నేతతో చేతులు కలిపి అధికారులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో జాయింట్ పట్టాను అక్రమంగా మార్పు చేసిన వ్యవహారం వెలుగు చూసింది. సర్వే నెంబర్లు 167, 68/1, 68/2, 68/3/1, 68/3/2, 212/1, 212/2, 213/1, 213/2లో గల సుమారు 12 ఎకరాల భూమి దుర్గం రాజారాం, బంగారు, బానయ్య, మాంతయ్య పేరిట జాయింట్ పట్టాలో ఉండగా, ప్రస్తుత చట్టాల ప్రకారం జాయింట్ పట్టాను మార్పు చేయడం వీలుకానిది. అయినప్పటికీ, అధికారులు దుర్గం రాజారాంతో పాటు ఆయన వారసులకు తెలియజేయకుండానే దుర్గం శంకర్, రజినీకాంత్, అశోక్, కావిరి బాపు, మల్లక్క, లక్ష్మి పేర్లకు పట్టా మార్చారని భాదితులు తెలిపారు.ప్రతి రిజిస్ట్రేషన్‌కు ఓ రేటు ఉండే కోటపల్లి తహసీల్దార్ కార్యాలయంలో, ప్రయివేట్ దళాల ద్వారా భారీ వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**దుర్గం సమ్మయ్య మాట్లాడుతూ..**

జాయింట్ పట్టాలో మా నాన్న దుర్గం రాజారాం పేరు మొదట ఉంది. ఆయన బతికే ఉన్నాడు. అయినా అక్రమార్కులతో చేతులు కలిపిన అధికారులు కనీస సమాచారం ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇతరుల పేర్లకు పట్టా మార్చారు. మేము తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నిలదీయగా.. 'రాజీ చేసుకోండి' అంటున్నారు. మేము జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. తప్పుడు పద్ధతుల్లో మార్చిన పట్టాలను రద్దు చేసి, బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో భాదితులైన దుర్గం సమ్మయ్య, మాంతయ్య, బానయ్య, బంగారు తదితరులు పాల్గొన్నారు.

# చెక్‌పోస్టులో ఎసిబి అధికారుల దాడులు

**ప్రజాపక్షం/పిట్లం(జుక్కల్):**మద్నూర్ మండలంలో సలాబత్‌పూర్ అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులో ఏసీబీ అధికారులు బుధవారం రాత్రి నుండి గురువారం మద్యాహ్నం వరకు దాడులు నిర్వహించారు. చెక్‌పోస్టులో పనిచేస్తున్న ఆర్టీఓ, అసిస్టెంట్లు తెలంగాణ నుండి ఇతర రాష్ట్రాలకు వెళ్ళే లారీల వద్ద భారీ మొత్తంలో అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు అధికారులు దాడులు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇక్కడ పనిచేస్తున్న అధికారులు ప్రైవేటు వ్యక్తులు ప్రతీ లారీ డ్రైవర్ వద్దకు వెళ్ళి 500ల నుండి 1000 రూపాయల వరకు వసూల్ చేస్తున్నట్లు తమ తనిఖీలో తేలిందన్నారు. దీంతో అధికారులు తమ జేబులు నింపుకుంటూ ప్రభుత్వానికి పన్నులు రాకుండా చేస్తున్నారన్నారు. ఘటనలో ఉన్నతాధికారుల ఆదేశానుసారం అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న స్థానిక అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ చెక్‌పోస్టులో 91 వేల రూపాయల అవినీతి సొమ్మును స్వాదీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.



# సైబర్ మోసానికి గురైన ఎడపల్లి వాసి

పిఎం కిసాన్ మెసేజ్ పేరుతో

రూ. 2.03లక్షలు మాయం



**ప్రజాపక్షం/ఎడపల్లి:**నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన ఇందూరు శంకర్ అనే రైతు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి తన ఖాతా నుంచి ఏకంగా రూ. 2.03లక్షలు పోగొట్టుకున్నారు. పీఎం కిసాన్ పథ కం పేరుతో వచ్చిన ఒక మేసేజ్‌ను క్లిక్ చేయడం ద్వారా ఈ మోసం జరిగినట్లు బాధితుడు గురువారం ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫి ర్యాదులో శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 23న పొలం పనులు చేసుకుంటుండగా ఆయనకు పీఎం కిసాన్ పథకానికి సంబంధించినదిగా భావించే ఒక మెసెజ్ వచ్చింది. ఆ మెసెజ్‌లోని లింక్‌ను క్లిక్ చేయడంతో ఓటీపీలు రావడం ప్రారంభించాయి. ఈ క్రమంలో ఫోన్ నెట్ ఆఫ్ చేసుకొని ఉంచుకోగా సిమ్ బ్లాక్ అయ్యింది. అయితే జియో ఆఫీసుకు వెళ్లి పరిశీలింగా సిమ్ బ్లాక్ అయినట్లు తెలిసింది. దీంతో అనుమానం వచ్చి బాధితుడు మరుసటి రోజు బ్యాంకుకు వెళ్లి బ్యాలన్స్ పరిశీలించగా తనఖాతాలో డబ్బులు ఉన్నాయని ఆ మరుసటి రోజు ఆశ్చర్యకరంగా మొదట ఆయన ఖాతాలోకి రూ. 35వేలు జమ అయ్యాయి. దీంతో ఇది నిజమేనని ఆయన నమ్మారు. ఆ తరువాత రోజుల నుంచి మాత్రం విడతల వారిగా ఆయన ఖాతా నుంచి మొత్తం రూ. 2,03,000 అదృశ్యమయ్యాయి. దీంతో తాను మోసపోయానని గ్రహించిన శంకర్, ఈ ఘటనపై ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అంతకుముందు మరో లక్ష రూపాయాలను తన కూతురు ఫీజు కట్టడం జరిగిందని బాధితుడు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఇలాంటి సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ప్రభుత్వ పథకాల పేరుతో వచ్చే నకిలీ మెసెజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని కూడా వారు హెచ్చరించారు.

# సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన



**ప్రజాపక్షం/ఎడపల్లి:**ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఎఎన్‌ఎం, ఆశాకార్యకర్తలతో మలేరియా, డెంగీ, ఫైలేరియా వ్యాధులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి వినీత్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో వైద్య సిబ్బంది చేపట్టిన నివారణ, నిర్మూలన నియంత్రణ చర్యలతో వ్యాధులు తగ్గుముఖం పట్టాయని అన్నారు. మలేరియా డెంగ్యూ వ్యాధులు తీవ్రమైతే జరిగే పరిణామాలపై సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎడపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చపట్టాలని ఆదేశాలు ఉన్నాయని, గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ డెంగ్యూ, మలేరియా, జ్వరం లక్షణాలుఉన్న వారి వివరాలు సేకరించాలని వారిని ప్రత్యేక ఫార్మాట్‌లో నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపాలన్నారు. ఎక్కడైతే అధిక కేసులు నమోదు అవుతాయో ఆ గ్రామంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి డెంగ్యూ, మలేరియాటెస్టులు చేపడుతామని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచన



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:**మాదక ద్రవ్యాల వాడకంతో నేర ప్రవర్తన పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ వాటి నుంచి దూరంగా ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యువ రాజ తెలిపారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన పాఠశాల, కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వ్యక్తిని చెడు వ్యసనాలకు నెగ్గిస్తాయి. ఆపై నేరప్రవర్తన వైపు దారి తీస్తాయి. శారీరక, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా విద్యార్థులు మంచినీటి వలె స్వచ్ఛంగా ఉండాలి. రోజూ యోగా, నడక, వ్యాయామం అలవాటు చేసుకోవాలి. ఆరోగ్యవంతమైన జీవనశైలి పాటిస్తే వ్యసనాలకు దూరంగా ఉండగలం'' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అంజనీ దేవి, టిఎస్డబ్ల్యుటిసి ప్రిన్సిపాల్ యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జులై 2న మంచిర్యాల ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు

జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు...

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలను జూలై 2వ తేదీన మంచిర్యాల ఆర్యవైశ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై రెండవ తేదీన ఉదయం పది గంటల నుండి 12 గంటల వరకు నామినేషన్ల స్వీకరించి 3వ తేదీన ఉదయం పది గంటల నుండి 12 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, 6వ తేదీన ఉదయం పది గంటల నుండి 1 గంట వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుంధని అనంతరం సాయంత్రం మూడు గంటలకు ఓట్ల లెక్కింపు అనంతరం అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపారు. మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో పోటీ చేసే వారు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సభ్యత్వం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అలాగే ఓటింగ్‌లో పాల్గోని వారు కూడా ఆర్యవైశ్య మహాసభలో సభ్యత్వం ఉండాలని ఇప్పటి వరకు ఓటు హక్కుల వారు అర్హులని, మిగితా వారికి కూడా ఓటు హక్కు కల్పించేందుకు జూలై 1వ తేదీ వరకు ఆర్యవైశ్యులందరికి ఓటు హక్కు కల్పించడం జరుగుతుంధని ఈ అవకాశాన్ని మంచిర్యాలలోని ఆర్యవైశ్యులంతా వినియోగించుకోవాలని కోరారు.

## సాహు మహరాజ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

బిసి భవన్‌లో జయంతి ఉత్సవాలు...

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** బిసి వర్గ ప్రజల ఆకాంక్షల సాధన కోసం సాహు మహరాజ్ స్ఫూర్తితో ఉద్యమించాలని బిసి సంఘాల నేతలు గురువారం ప్రకటించారు. స్థానిక బిసి భవన్‌లో జిల్లా బిసి ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన చత్రపతి సాహు మహరాజ్ 151 వ జయంతి సభలో బిసి నాయకులు పాల్గోని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిసి వర్గాలకు రిజర్వేషన్ల హక్కును మొదటిసారిగా 1902లో అందించిన బహుజన బాంధవుడు చత్రపతి సాహు మహరాజు అని వారు పేర్కొన్నారు. నాటి కొల్లాపూర్ సంస్థానపు రాజు అయిన హాసు మహరాజ్ భారత సామాజిక న్యాయ ఉద్యమానికి విలువైన సేవలు అందించారని తెలిపారు. బిసి ఉద్యమ మార్గదర్శులు మహత్మపూలే, సాహు మహరాజ్, మండల్ చూపిన బాటలో ఆత్మాభిమాన ఉద్యమాన్ని బిసిలు కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 41 శాతం బిసి రిజర్వేన్లను తక్షణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల నియోజకవర్గంలో బిసి రాజ్యాధికారాన్ని సాధించే చైతన్యం జిల్లాలోని ప్రజలలో రావాలని వారు పిలుపునిచ్చారు. బిసి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కునుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బిసి రాజ్యాధికార సమితి జిల్లా కార్యదర్శి,రిటైర్డు ఎంఇఒ శ్రీరామోజు కొండయ్య, సామాజిక ఉద్యమ నాయకుడు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రమోషన్ పొందిన వారిని అభినందించిన పోలీసు కమిషనర్

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :తెలంగాణ రాష్ట్ర డిజిపి ఆదేశానుసారం నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఏఎస్ఐ నుండి ఎస్ఐలుగా ఇద్దరు ప్రమోషన్ పొంది నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయిచైతన్యను మర్యాదపూర్వకంగా కలిశారు . ఎస్ఐలుగా పదోన్నతి పొందిన సందర్భంగా ఎస్.రాజు, ఏఎస్ఐ, రుద్రూర్ పోలీసుస్టేషన్, జవాన్ భీంరావు, ఏఎస్ఐ, సిసిఎస్‌లకు పోలీసుకమిషనర్‌శుభాకాంక్షలు తెలిపా రు.

# అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ దినోత్సవం

ప్రజాపక్షం / నందిపేట్:నందిపేట్ మండల కేంద్రంలో గురువారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు 2 కె రన్ స్థానిక నంది విగ్రహం నుంచి ప్రారంభించారు. కార్యక్రమంలో గెలుపొందిన యువకులకు నందిపేట్ ఎస్ఐ చిరంజీవి పోలీసుశాఖ తరఫున బహుమతులు అందజేశారు. నందిపేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, యువకులు పాల్గొన్నారు.

# కురిసిన వర్షం... కుదుటపడ్డ రైతులు

చిగురించిన రైతన్న ఆశలు..



ప్రజాపక్షం/నందిపేట్ :గత పదిరోజులుగా వర్షాలు లేక వేసిన మెట్ట పంటలు ఎండిపోతున్నాయి. సోయబిన్, మొక్కజొన్న పంటలు ఎండలకు నీళ్లు లేక ఎండిపోతున్న దశలో బుధవారం నుంచి వర్షాలు పడడంతో రైతులు కాస్త కుదుట పడ్డారు. వారి ఆశలు చిగురించాయి. నందిపేట్ డొంకేశ్వర్ మండలాల్లో కొన్ని గ్రామాలలో తొలకరి వర్షాలకు వర్షాధారపు పంటలు వేస్తారు. ఎన్ని బోరుబావులు వేసిన నీళ్ళు పడని బూములలో మెట్ట పంటలు వేశారు. చాలామంది రైతులు ఎండిపోయిన సోయా స్థానంలో మొక్కజొన్న వేయడానికి సిద్ధమవుతున్నారు. సకాలంలో వర్షాలు లేక రైతులు ఎన్నో పాట్లు పడుతున్నారు. ఏదేమైనా నిన్నటి నుంచి వర్షం పడడంతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

# ముప్కాల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా బద్దం నర్సారెడ్డి

ప్రజాపక్షం/భీమ్‌గల్:ముప్కాల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షునిగా బద్దం నర్సారెడ్డిని నియమిస్తు మాజీ మంత్రి,బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి గురువారం నాడు ఉత్తర్వులను జారీ చేశారు.నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నర్సారెడ్డి మండలంలో పార్టీ అభివృద్ధికై కృషి చేస్తు, కార్యకర్తలను సమన్వయ పరుస్తారని వేముల లేఖలో పేర్కొన్నారు.ప్రజా సమస్యలపై పోరాటం చేస్తారని ప్రజల పక్షాన నిలబడుతారని అన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం: ఎస్ఐ



ప్రజాపక్షం/ఎడపల్లి:సమాజంలో పెరుగుతున్న విపరీత ధోరణులు, ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలకు బానిసలై తమ విలువైన జీవితాలను కోల్పోతుండటం పట్ల ఎడపల్లి ఎస్ఐ వంశీకృష్ణారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదకరమైన ధోరణిని నిర్మూలించి, డ్రగ్స్ రహిత స మాజాన్ని నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. అంతర్జాతీ య మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ఎడపల్లి మండల కేంద్రంలో జడ్పీ హై స్కూల్ విద్యార్థులు, పోలీస్ సిబ్బందితో కలిసి ఒక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే తీవ్ర పరిణామాలను వివరించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడటం వలన శారీరకంగా , మానసికంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. కుటుంబాలు కూడా చిన్నాభిన్నమవుతాయని, ఆర్థికంగా నష్టపోతారని హెచ్చరించారు. అంతేగాకుండా సామాజికంగా నేరాలు పెరిగి, శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని అన్నారు. యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన హితవు పలికారు. డ్రగ్స్ వాడే వారి గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఎస్ఐ వంశీ కృష్ణారెడ్డి కోరారు. ఈ అవగాహన ర్యాలీలో ఏఎస్ఐ ఇల్యాస్ అలీ, పోలీస్ సిబ్బంది, జడ్పీ హై స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మత్తు చేస్తుంది జీవితాన్ని చిత్తు

నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య



ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :మత్తు చేస్తుంది జీవితాన్ని చిత్తు, మాదక ద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత అని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. గురువారం యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వారోత్సవాల సందర్భంగా స్కూల్ విద్యార్థులతో పాత కలెక్టరేట్ కార్యాలయం వద్ద ర్యాలీని పోలీసు కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ పాత కలెక్టరేట్ కార్యాలయం నుండి ప్రారంభమై జిల్లా ఫైర్‌స్టేషన్, రాష్ట్రపతి రోడ్డు, ఖలీల్‌వాడి, రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత అని, డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం డ్రగ్స్ రహిత సమాజాన్ని భావితరాలకు అందిద్దామన్నారు. ముఖ్యంగా యువత ఆనందం కొరకు అలవాటు చేసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దని అన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తు ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2015 సంవత్సరం వరకు దాదాపు 15 లక్షల మంది డ్రగ్స్‌కు బానిసలు అయినట్టు రికార్డులో ఉందన్నారు. డ్రగ్స్ నియంత్రణ కొరకు కష్టపడే వారు ప్రతి ఒక్కరు ఒక సైనికుడిలా పనిచేయాలన్నారు. యువత ఎంతో బంగారు భవిష్యత్తు కలిగిన వారు, గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, ఇలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు సేవించే వారి మానసిక స్థితిని కోల్పోయి నేరాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ కరోలినా చాంగ్ ఎన్.మావీ, నిజామాబాద్ అదనపు పోలీసు కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి, డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్ బి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డిప్యూటి కమిషనర్ సోమిరెడ్డి, నిజామాబాద్ ఏసిపి రాజా వెంకట్‌రెడ్డి, విద్యార్థులు, ఎన్‌సిసి క్యాడెట్స్, అంగన్‌వాడి టీచర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు పోటెత్తిన ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు

17 మంది పిల్లలను చేర్పించిన ప్రభుత్వ ఉద్యోగులు

ప్రజాపక్షం/భీమ్‌గల్:గతంలో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి సామాన్యులే బయపడి ప్రేవేట్ బడులకు తమ పిల్లలను ఫీజులు ఎక్కువైన పంపించేవారు.కాని పరిస్థితులు మారాయి.ప్రభుత్వ పాఠశాలలో బోధన సామర్థ్యం పెరగడం మంచి ర్యాంకులు రావడంతో ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు.దీనికి ఉదాహరణే మండలంలోని బెజ్జోరా జెడ్పిహెచ్ఎస్ పాఠశాల.పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడిగా భాధ్యతలు చెపట్టిన హాఫీజుద్దీన్ ఉపాధ్యాయుల సహకారంతో పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించారు.దీనితో అదే పాఠశాలకు చెందిన పలువురు సిబ్బంది తమ పిల్లలని ఈ పాఠశాలలో చెర్పించారు.ఈ సంవత్సరం ఏకంగా 17 మంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారు తమ పిల్లలని పాఠశాలలో చెర్పించి అందరికి ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతు ఈ సంవత్సరం 60 మంది నూతనంగా తమ పాఠశాలలో చేరారని అన్నారు.మండలంలోనే తమ పాఠశాల ఆదర్శంగా నిలిచిందన్నారు.తమ పాఠశాల సిబ్బంది సహకారంతో మరింతగా పాఠశాలను అభివృద్ధి చేస్తామన్నారు.

# యథేచ్ఛగా హుక్కా

గతంలో రహస్య ప్రాంతాలలో,

నేడు పట్టణం నడిబొడ్డున సేవనం

ప్రజాపక్షం/భీమ్‌గల్:ప్రభుత్వం ఇక వైపు మాదక ద్రవ్యాల నిర్మూలన కోరకు పాటుపడుతుంటే మరోవైపు హుక్కా,గంజాయి విక్రమాలు, సేవనం విచ్చల విడిగా కోనసాగుతుంది.అంతర్జాతీయ మాదకద్రవ్య దినోత్సవ కార్యక్రమాలు కోనసాగుతుంటే యువత మాత్రం తమ పని కానిస్తున్నారు.దీనికి ఉదాహరణే భీమ్‌గల్ పట్టణంలో నందిగల్లిలోకు చెందిన సొంపల్లి గంగనర్సయ్య తను నూతనంగా నిర్మిస్తున్న ఇంట్లో చప్పుడు రావడాన్ని గమనించి వెళ్ళి చూడగా అక్కడ కొంత మంది యువకులు హుక్కా సేవిస్తుండటంతో వారిని పట్టుకోవడానికి ప్రయత్నించడంతో గేటు దూకి పారిపోయారు.వారు తాగడానికి తెచ్చుకున్న హుక్కా,ఇతర వస్తువులు అక్కడే వదిలి వెళ్ళారని నర్సయ్య తెలిపారు.

గంజాయి,హుక్కాకు యువకులు బానిసలుగా మారడంతో గతంలో నిర్మాణుశ్య ప్రాంతాలలో మాత్రమే గంజాయి,హుక్కాలు సేవించే వారు ఇప్పుడు నేరుగా పట్టణం నడిబోడ్డులో సేవిస్తుండటం తీవ్ర కలకలం రేపింది.పోలీసు,అబ్కారీశాఖలు కేవలం ప్రచారాలకే పరిమితం కావడం వళ్ళే ఇలాంటివారు రెచ్చిపోతున్నారని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.పలు కిరాణషాపులలో హుక్కా వాటికి సంబంధించిన వాటిని యధేచ్ఛగా విక్రయిస్తుండటంతో సులువుగా లభిస్తున్నాయి కిరాణషాపులపై తనిఖీలు చేయరు కాబట్టి విచ్చలవిడిగా అమ్ముతున్నారన్న సమాచారం.

# కామ్రేడ్ డివికె కృష్ణకు ఘన నివాళి

3వ వర్ధంతి సందర్భంగా స్మారక కార్యక్రమం



ప్రజాపక్షం/ఎడపల్లి:భారత విప్లవ యోధుడు, ఆదర్శ కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమనేత, ప్రజాపంథా మార్గ నిర్దేశకుడు స్వర్గీయ కామ్రేడ్ దుర్గెంపూడి వెంకటకృష్ణ 3వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం తాడ్ బిలోలి గ్రామంలో స్మారక కార్యక్రమం నిర్వహించారు. నాయకులకు, కార్యకర్తలకు నిత్య చైతన్య స్ఫూర్తిగా నిలిచిన డివికే కృష్ణకు విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నాగన్న, పార్వతి రాజేశ్వర్ మాట్లాడుతూ.. కామ్రేడ్ డివికే కృష్ణ నిజాయితీ, నిరాడంబరత కలిగిన నాయకుడిని కొనియాడారు. ఆయన గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా అనేక పోరాటాలలో ముందుండి నడిపించిన వ్యక్తి అని గుర్తు చేసుకున్నారు. డివికే కృష్ణ చేసిన సేవలను, త్యాగాలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు ఒడ్డెన్న, మండల కార్యదర్శి షేక్ నసీర్, మండల నాయకులు మిద్దె పెద్దులు, గోపాల్, సిద్ధ పోశెట్టి, ఎల్ గంగాధర్, జబ్బార్, హమీద్, శివాజీ, మక్కన్నలతో పాటు పలువురు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలు మనిషి అంతానికి కారకాలు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బివిఎన్ భరతలక్ష్మి

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్:మాదకద్రవ్యాలు మనిషి అంతానికే కారకాలని, మాదక ద్రవ్యాలను సేవించడం వల్ల మనిషి తన అస్తిత్వాన్ని కోల్పోవడమే కాకుండా మరణానికి దారితీస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బివిఎన్ భరతలక్ష్మి అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవ సాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు సముదాయం డివిఎల్ఎస్ఏ భవనం నుండి ధర్నా చౌక్, కోర్టు ప్రాంగణం వరకు కోర్టు సిబ్బంది, పిఎల్‌విలు, న్యాయవాదులతో కలిసి సే నో డ్రగ్స్ అన్న నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగించడం ద్వారా మనిషి ప్రాణాలను కోల్పోతున్నారని, మరీ ముఖ్యంగా యువత ఈ డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని కావున తల్లిదండ్రులు తమ బిడ్డలపై ఒక కన్ను వేసి ఉంచాలని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆ కుటుంబం మనశ్శాంతిని కోల్పోతుందన్నారు. కార్యక్రమంలో డివిఎల్ఎస్ఏ సెక్రెటరి ఉదయ భాస్కర్ రావు, ఏవో శైలజ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయిరెడ్డి, మాణిక్ రాజ్, రాజ్‌కుమార్ సుబేదార్, పిఎల్‌విలు జీవన్‌రావు, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, వినీల, న్యాయవాదులు, డివిఎల్ఎస్ఏ సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండండి;ఎస్ఐ విక్రమ్



ప్రజాపక్షం/మోర్తాడ్:గ్రామాల్లోని యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని మోర్తాడ్ ఎస్ఐ విక్రమ్ పిలుపునిచ్చారు. అందులో భాగంగానే గురువారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మోర్తాడ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులలో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం 2కె రన్ నిర్వహించి డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాల్లోని యువత డ్రగ్స్ కు దూరంగా ఉంచేలా విద్యార్థులలో చైతన్యం కలిగించడం లక్ష్యంగా పెట్టుకున్నామని ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ గ్రామంలోని పలు స్కూళ్లలోని విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీపై బిజెవైఎం సదస్సు

### 50ఏళ్ల చీకటి అధ్యాయంపై చర్చ

ప్రజాపక్షం/ఎడపల్లి:భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నేడు ఎడపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ విధించిన ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్యానికి చీకటి అధ్యాయానికి 50సంవత్సరాలు అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు బీజేవైఎం మండల అధ్యక్షుడు సాయి పేర్కొన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సు నేడు ఉదయం పది గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఎమర్జెన్సీ విధించి 50సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో భారత ప్రజాస్వామ్యంపై దాని ప్రభావం, అప్పటి పరిస్థితులు, భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సదస్సులో చర్చించనున్నామన్నారు. ఈ సదస్సులో బిజెపి నాయకులు, బిజెవైఎం కార్యకర్తలు పెద్ద సంఖ్యలోపాల్గొని విజయవంతం చేయాలని సాయిలు పిలుపునిచ్చారు.

## మాదకద్రవ్యాల నిరోధానికి అవగాహన

### మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

ప్రజాపక్షం/నిజామాబాద్ప్రతినిధి :మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఎంతో విలువైన జీవితాలను చిత్తు చేస్తాయని విద్యార్థులు వాటి జోలికి వెళ్లకూడదని ప్రధానోపాధ్యాయులు వెంకట్రామయ్య అన్నారు. మత్తు పదార్థాల నిరోధానికి విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, డీఈఓ అశోక్ సూచనల మేరకు గురువారం మండలంలోని హొన్నాజీపేట్ జడ్పీహెచ్‌ఎస్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించామన్నారు. మత్తు పదార్థాలతో కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించామన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని ఎలాంటి మత్తు పదార్థాల వైపు కన్నెత్తి చూడకూడదని అవి సేవించే వారితో స్నేహ చేయకూడదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నౌషిరాం, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంజాయి,మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు

ప్రజాపక్షం/భీమ్‌గల్:మత్తుకు బానిసలైన యువత అడ్డదారులు,చెడుదారుల్లోకి వెళ్ళున్నారని భీమ్‌గల్ ఎస్ఐ జి.మహేష్ అన్నారు.పోలీసుశాఖా అధ్వర్యంలో గురువారం నాడు ఉదయం 5కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గోని బడా భీమ్‌గల్ చౌరస్తా నుండి లింబాద్రి గుట్ట వరకు యువకులు పరుగులు తీసారు.అనంతరం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పాఠశాల,కళశాల విద్యార్థులకు మత్తు పదార్థాల ప్రభావం గురించి వారికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు యువకులు చెడు వ్యసనాల భారీన పడి తమ జీవితాలను నాశనం చేసుకోకుడదని సూచించారు.శ్రద్దగా చదువుకోనని ఉన్నతస్థాయిలో ఉండాలని తెలిపారు.బుధవారం నాడు శ్రీ సరస్వతి విద్యా మందిర్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించగా గెలుపోందిన వారికి బహుమతులు అందజేశారు.5కె రన్‌లో గెలుపోందిన వారికి మెడల్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో అబ్కారిశాఖా సిఐ వేణుమాధ రావు, ఎంపిడివో సంతోష్,ప్రభుత్వ వైద్యుడు అజయ్, విద్యార్థులు,పలు పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారుల తనిఖీ

ప్రజాపక్షం / హుజురాబాద్ : కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం లో సిర్సపల్లి, ధర్మరాజుపల్లి, కందుగుల, చెల్పూర్ గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను హుజురాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులతో వానాకాలము సీజన్ కి సంబంధించి ఎరువుల విత్తనాల పురుగు మందుల నిల్వలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపినారు. అందరు డీలర్లు కాలం చెల్లిన విత్తనాలు, కాలం చెల్లిన పురుగు మందులు, నిషేధిత పురుగు మందులు అమ్మకూడదని అన్నారు. అలాగే తమ రికార్డులు ఎప్పటి కప్పుడు సక్రమంగా నిర్వహిస్తూ స్టాక్‌రిజిస్టర్లను రోజువారిగా రాయాలని సూచించారు. పిఓఎస్ మిషిన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు చేయాలని, భౌతిక నిల్వలు పిఓఎస్ మిషిన్ లోని నిలువలతో తప్పక సరి చూసుకోవాలని సూచించారు. షాపు యొక్క మెయిన్ బోర్డు పైన డోర్ నెంబర్, లైసెన్స్ యొక్క వివరాలు తప్పక పొందు పరచాలన్నారు. అధీకృత లైసెన్సులు లేకుండా వ్యాపారం చేయకూడదని, రెన్యువల్ చేయించుకొనుటకు తగినంత ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విత్తన ఎరువులు క్రిమిసంహారక మందులకు స్టాక్ బోర్డులు విడి విడిగా ఏర్పాటు చేసి ప్రదర్శించాలన్నారు. విత్తనాలు, ఎరువులు పురుగు మందులను విడివిడిగా పొందు పరచుకోవాలన్నారు. ప్రతిరోజు స్టాక్ బోర్డ్ ను క్రయ విక్రయాలను బట్టి సరి చేసుకోవాలని తెలిపారు. విత్తనాలు విక్రయించేటప్పుడు రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ధరలు ఎంఆర్పి కి మించి అమ్మరాదని, అమ్మితే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో హుజురాబాద్ మండల వ్యవసాయ అధికారి చాడ భూమి రెడ్డి పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత

### ధర్మపురి ఎస్ఐ పి.ఉదయ్ కుమార్



ప్రజాపక్షం / ధర్మపురి : డ్రగ్స్,మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ పక్షాన పటిష్ఠ చర్యలు తీసుకుంటామని అదేవిధంగా వాటి నిర్మూలనకై ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జగిత్యాల జిల్లా ధర్మపురి ఎస్ఐ పులిచెర్ల ఉదయ్ కుమార్ అన్నారు. ప్రపంచ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ పక్షాన పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నందీచౌక్ వద్ద విద్యార్థులు, స్థానికులతో మానవహారం నిర్వహించి డ్రగ్స్ నిర్మూలనకై ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. మత్తుపదార్థాలకు బానిసైన యువత బంగారం లాంటి ఉజ్వల భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నదని అన్నారు.డ్రగ్స్ వినియోగంపై కలిగే పరిణామాలపై అవగాహన పెంచుకుని వాటికి దూరంగా ఉండాలని, గంజాయి,ఇతర మత్తుపదార్థాల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలపాలని ఎస్సై సూచించారు.

## అమెరికా సామ్రాజ్యవాదానికి వంత పాడుతున్న మోదీ

### * సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి

ప్రజాపక్షం హుజురాబాద్ : సిపిఎం పార్టీ హుజురాబాద్ మండల శాఖ సమావేశం కొప్పుల శంకర్ అధ్యక్షతన గురువారం రోజున స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి హాజరై మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదానికి ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం వంత పాడుతున్నారని అన్నారు. ఇరాన్ పై, ఇజ్రాయిల్ చేస్తున్న, ఏకపక్ష దాడులను ఖండించకుండా, అమెరికా ట్రంప్, యుద్ధ విమానాలతో ఇరాన్ పై దాడి చేయడం పశ్చిమాసియా దేశాలలో అగ్రరాజ్య ఆధిపత్యాన్ని చలాయించాలని చూడడం, యుద్ధంతో ప్రజల ప్రాణాలు తీస్తూ, ఆర్థిక అస్థిరతను కల్పిస్తూ, విధ్వంసం సృష్టిస్తూ, మళ్లీ తన వల్లనే ఇరుదేశాలలో శాంతిని కోల్పోనీ. ట్రంపు చేస్తున్న తప్పుడు ప్రచారానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ మౌనంగా ఉండడం వెనుక ఆంతర్యం ఏమిటని, భారత్, పాకిస్తాన్ దేశాల అంతర్గత విషయాల మధ్యలో కూడా చొరబడి ఇదే రకమైన నీతిని ప్రదర్శించారని ప్రశ్నించారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి , తర్వాత అధికారాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు అంతకంటే ఘోరంగా ఎమర్జెన్సీని తలపిస్తూ తన పరిపాలన సాగిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇందిరా గాంధీ ప్రభుత్వానికి పట్టిన గతే పట్టక తప్పదని, ఆరోపించారు. మోడీ ప్రభుత్వం తన అధికారాన్ని కాపాడుకునేందుకు, ప్రశ్నించే గొంతులను నొక్కి వేస్తూ, పత్రికా విలేకరులను రచయితలను, మేధావులను, జైల్లో వేస్తూ, నిర్బంధిస్తూ, ప్రజా పోరాటాలను అణిచివేస్తూ, ప్రకృతి సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను, మొత్తం కార్పోరేట్ శక్తులకు విదేశీ, స్వదేశీ బడా పెట్టుబడుదారులకు కట్టబెడుతూ, దేశంలో ఆర్థిక అసమానతలు పెంచి పోషిస్తూ, నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, లేకుండా చేస్తూ, కులం, మతం, ప్రాంతాల మధ్య వైషమ్యాలు సృష్టిస్తూ, అధికారమే ధ్యేయంగా పరిపాలన కొనసాగిస్తున్న నరేంద్ర మోడీ బిజెపి పరిపాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు, కదిరే రమేష్, రాచపల్లి సారయ్య, శంకర్, రత్నాకర్, చిరంజీవి, రఘు, చాగర్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి అరవింద్ సమక్షంలో జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం /మల్లాపూర్ : బిజెపి మండల శాఖ అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను ఇందూర్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ సమక్షంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు నిజామాబాద్ లోని ఎంపి నివాసంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మోర పెల్లి సత్యనారాయణ రావు, బిజెపి మండల ఉపాధ్యక్షుడు లవంగ శివ తదితరులున్నారు.

## మత్తుకు బానిసై ఉజ్వల భవిష్యత్తును కోల్పోవద్దు

ప్రజాపక్షం/మల్లాపూర్: యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి మత్తుకు బానిసై ఉజ్వల భవిష్యత్తును కోల్పోవద్దని మల్లాపూర్ ఎస్ఐ కోసన రాజు అన్నారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పోలీస్ సిబ్బంది ఉన్నారు

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంపిడిఒ



ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్‌రావుపల్లి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను ఎంపీడీఓ గంగాధర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని, అప్పుడే మీ తల్లితండ్రుల కలలు నెరవేరుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించిన ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందరికి అందాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని కోరారు. యన వెంట పంచాయతీ కార్యదర్శి జ్యోతి, పాఠశాల అధ్యాపకబృందం ఉన్నారు.

## బిడి కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లకు ధరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/భీమ్‌గల్:బిడి కార్మీకుల పిల్లలకు 202526 సంవత్సరానికి గాను ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బిడి కార్మీక ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ ఎస్.శ్రీకాంత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.బిడి కార్మికుల పిల్లలకు అందించే ప్రీ మెట్రిక్(1 నుండి 10వ తరగతి), పోస్టు మెట్రిక్(ఇంటర్ నుండి డిగ్రీ )వరకు ఉపకారవేతనాల కోసం ఆన్‌లైన్‌లో www.scholarships.gov.in వెబ్‌సైట్లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రీ మెట్రిక్ చివరి తేది ఆగస్టు 31 వరకు.పోస్టు మెట్రిక్ అక్టోబర్ 31 వరకు చివరి తేది లని తెలిపారు.మరిన్ని వివరాలకు మండల కేంద్రంలోనిబిడి కార్మీక ఆసుపత్రిలో సంప్రదించాలన్నారు.

## మాజీ సర్పంచ్‌కు వేముల పరామర్శ

ప్రజాపక్షం/భీమ్‌గల్:వేల్పూర్ మండలం అంక్సాపూర్ మాజీ సర్పంచ్ ఎర్ల రాజేశ్వర్‌కు కాలి తుంటి ఎముక కు అపరేషన్ జరగడంతో ఆయనను మాజీ మంత్రి బాల్కోండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆర్టీసీ కార్పోరేషన్ మాజీ నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఆసుపత్రిలో రాజేశ్వర్‌ను పరామర్శించారు.

## ఎఐయుకెఎస్ ప్రథమ మహాసభ

ప్రజాపక్షం/భీమ్‌గల్:అఖిలభారత ఐక్య రైతు సంఘం కమకమర్‌పల్లి ఏరియా ప్రథమ మహసభను మండలంలోని హసకోత్తుర్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బాగంగా ఏరియా అధ్యక్షుడు ఉట్నూర్ బాలయ్య జెండాను అవిష్కరించి అమరవీరులకు నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి దేవారాం,జిల్లా అధ్యక్షుడు సురేష్ హజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రైతుల కోరకు,రైతు కూలీల కోసం రైతు కూలి సంఘం అధ్వర్యంలో ఎర్రజెండాలతో పోరాటాన్ని సాగిస్తుందన్నారు.దున్నేవాడిదే భూమి అని నినాదాన్ని చాటిచెప్పిన ఘనత ఏఐయుకేఎస్ కే దక్కుతుందన్నారు.రాజధాని ఢీల్లిలో రైతుల ధర్నాకు తలవంచి క్షమాపనలు చెప్పి వారు చేసిన నల్ల చట్టాలను వెనక్కి తీసుకోన్నారని అన్నారు.కార్పోరేట శక్తులకు వ్యవసాయాన్ని కట్టబెట్టేల చర్యలు తీసుకునడాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం జరిగిందన్నారు.స్వామినాథన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని ,రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఏరియా అధ్యక్షునిగా ఉట్నూర్ బాలయ్య,ప్రధాన కార్యదర్శిగా తోపారం బాలకిషన్‌ను ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో సత్యనారాయణ,కిషన్, అశోక్,స తృక్క, రాజేశ్వర్ తదితరులు పాల్గోన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి

### శ్రీనివాస్, బోధన్ ఎసిపి

ప్రజాపక్షం/బోధన్:సమాజ శ్రేయస్సు కోసం మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అవసరం ఉందని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఏసీపీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వల్ల సామాజికంగా నేరాలు పెరిగి శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయన్నారు. డ్రగ్స్ రహిత సమాజనిర్మాణానికి అందరం కలిసి కట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ సీఐ వెంకట్ నారాయణ, రూరల్ సిఐ విజయ్ బాబు, పోలీస్ సిబ్బంది, సిడిపిఓ పద్మ తదితరులు పాల్గొన్నారు.